రోడ్డు చాలా విశాలంగా ఉంది. అటూ ఇటూ చెట్లతో కంటికి చల్లగా పచ్చగ ఉంది. నేనెక్కడున్నానో నాకు తెలీడం లేదు. నేనా రోడ్డుమీద నడుస్తున్న జ్ఞాపకం లేదు. లేక దానిమీదుగా ఎగిరి వస్తున్నానా? ఆ వివరాలేమీ తెలియవు. కాని ఏదో వేగం నన్ను తరుముతోంది. మొత్తానికి నేనా రోడ్డును అనుసరించి, అతివేగంగా వస్తున్నాను. ఉన్నట్టుండి రోడ్డుమీద నల్లగా, లోతుగా, బిళ్ళలాగా, ఏదో కనిపించింది. అనంత వేగంతో దూరం తరిగి పోతున్న కొద్దీ, అది బకాసురుడి నోరులా భయంకరంగా, అతి వికృతంగా పెద్ద గొయ్యిలా ఘూరి పోయింది. నా ఒంటిమీద రోమాలు నిక్కబొడుచుకున్నయ్. నేనా గోతిలో పడతానన్న భయంవల్లనా? కాదే! నేనా రోడ్డుమీద నడిచి రావడం లేదే! నా శరీరమే నాకు కనిపించనప్పుడు శరీరానికి సంబంధించిన ఈ జలదరింపేమిటో!

నేనా గొయ్యినింకా దాటి పోలేదనుకుంటాను. ఇంతలో దూరంగా చుక్కలా మెరుస్తూ ఏదో ముందుకు ముందుకు అతివేగంగా వచ్చేస్తోంది. నాలో రక్తానికి బదులు భయం విద్యుత్తులా ప్రసరిస్తోంది. జివ్వుమనిపిస్తోంది. నన్ను వణికిస్తూ ఉరకలు వేస్తోంది. అయిపోతుంది. అంతా రెప్పపాటులో నాశనమైపోతుంది. అంత ఉరవడిగా ముందుకు దూకుతున్న దదేద్దో గోతిలో పడిపోతుంది. భయ వివశతవల్ల నేను గట్టిగా అరిచానా? లేక ఆ వస్తువే నల్లగా, వికారంగా లోతుగాఉన్న ఆ గోతిలో పడిపోతూ చావుకేక పెట్టిందా? గణగణలాడుతూ, గంటలా మోగిందా?......

హటాత్తుగా మెలకువ వచ్చింది. పక్కనే బల్లమీద, చేతికందేట్లు పెట్టుకున్న అలారం గణగణ మోగుతోంది. ఏవిటీ కల! కల్లో, వినిపించిన ఆ వికృత ధ్వనికీ, ఈ అలారం మోతకూ ఎట్లా కుదిరిందలంకె? అయినా ఆ గొయ్యేవిటి అంత అసహ్యంగా!......

ఆ వేళ నాకు వెంకటగిరిలో చిన్న పని తగిలింది. నా ఆప్తమిత్రు డొకడు వాడికి సంబంధించిన ఆఫీసు వ్యవహార మొకటి పరిష్కరించుకు రమ్మన్నాడు. కాలేజీలో పాఠాలు చెప్పుకునే వాణ్ణి కాబట్టి మిట




మిటలాడే మే నెలంతా నీడపట్టున ఉండే అవకాశం అధికారులు కల్పించారు. కాని దేవుడు వరమిచ్చినా పూజారి వరమియ్యడు గదా! నేను సుఖంగా కాలుకదపకుండా ఇంట్లో ఉండిపోతున్నాననే అని నా మిత్రులందరికీ కన్నెర్ర. వాళ్ళ పనుల్లో ఏదో ఒకటి నాకు తగిలించందే నిద్ర పట్టదు. ఆ ప్రయాణంకోసమే పొద్దున్నే లేవాలని అలారం పెట్టుకున్నాను.

లేచాక, ఆ చీకటి వేళ శ్రీమతి కాఫీ చప్పరించి, బస్సులో వచ్చి... బస్సు ఖాళీగానే ఉంది. మనుషులు

క్కురే వస్తున్నారా- నిద్రమంచం మీదనుండి అట్లాగే లేచి వచ్చేసిన వాళ్ళూ, శుభ్రంగా తయారై పెళపెళ లాడుతూ వచ్చిన వాళ్ళూ, అందరితోటీ బస్సు కలగా పులగంగా ఉంది. ఇంకా రావలసిన వాళ్ళను కేకలతో రాబట్టుకోడానికి కాబోలు, కండక్టరు, 'వెంకటగిరి, తిరపతి, మదనపల్లి' అని అరుస్తున్నాడు. గూడూరునుండి, వెంకటగిరికీ; తిరపతికీ, వెళ్ళే ప్రయాణీకుల రద్దీ చాలా ఎక్కువ. ఎన్ని బస్సులున్నా అన్నీ కిటకిటలాడుతుండాల్సిందే.

వెంకటగిరిలో బస్సు దిగగానే మా శాంతమ్మ ఇంటికి వెళ్ళాలి. అది నాకు అవడానికి పినతండ్రి కూతురే అయినా, సొంత చెల్లెలికంటే ఎక్కువనిపిస్తుంటుంది. ముప్పై మైళ్ల దూరంలో వున్నా తనే ఉన్నా మా యిద్దరికీ ఎక్కువ రాకపోకలు అరుదు, ఇట్లాగే ఏదో పనిబడితేనేతప్ప ఇద్దరం కలుసుకునే అలవాటు లేనేలేదు. అట్లా అని మా యిద్దరి మనసుల్లో అంతరాలు లేవు. దానికి నేనంటే చాలా అపేక్ష. నాక్కూడా దాన్నీ దాని సంసారాన్నీ చూస్తుంటే కడుపు నిండిపోయినట్లే ఉంటుంది. మా శాంత కూతురు సుగుణ ముద్దబంతి పువ్వులాంటి పిల్ల. చిన్నపిల్లగా ఉన్నప్పుడు, అది 'మావయ్యా' అంటూ నా చుట్టూ తిరుగుతుండేది. నా ఒళ్ళో కూచుని మీసాలులాగి నానా యాగీ చేస్తుండేది. 'ఇట్లా మరీ అల్లరి చేశావంటే నిన్ను, పెళ్ళాడేస్తానే' అనే వాడిని. 'సరే! నన్ను చేసుకో! అత్తయ్యను ఇంట్లోంచి వెళ్లగొట్టేద్దాం' అని మాటకు మాటా ఎదురు చెప్పేది. అట్లాంటి సుగుణకు పెళ్ళి సంబంధాలు వెతుకుతోందట మా శాంత. అదిప్పుడు, పద్దెనిమిదేళ్లు నిండి బియస్సి పూర్తి చేసుకుని ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునుంది. వాళ్ళ నాన్నకు దాన్ని పై చదువులు చదివించడం యిష్టంలేదు. 'ఎక్కువ చదివితే మరీ ఎక్కువ చదివిన పెళ్లికొడుకు నెట్లా తెచ్చేది' అన్నదే గొడ్డ సమస్య. ఆ మొగుడూ పెళ్ళాల ...కీ, దాని పెళ్ళి దిగులు పట్టుకున్నం కూడా సయించడం ...మధ్య నేతదో-అన్నారు. సుగుణకో ... వెతకాలి. అవని

# గ్రో ఉత్య

...గనక నేనుచేస్తే మా శాంత మనసు చల్లబడుతుంది. సుగుణ నన్ను మెచ్చుకుంటుంది.

'రైట్' అన్న కండక్టరు గావుకేకతో ఆలోచన్లు చెదిరిపోయాయి, డ్రైవరు గేరులాగి బస్సును ముందుకు కదుపుతున్నాడు. జనమంతా నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. పొద్దుటి పూటేమో, ఎవరికివారే అంతర్ముఖులై ఏవేవో ఆలోచనల వలయాల్లో చిక్కుకుని తన్మయత్వం భజిస్తున్నారు. బస్సు గూడూరు దాటి వెంకటగిరి వెళ్ళే రోడ్డుమీదికి మలుపు తిరిగింది. అట్లా తిరిగినచోట రోడ్డు బాగా ఇరుకు. ఒకవైపు మరీ పల్లం. ఎదురుగా చూద్దుం కదా. జనం గుంపులు గుంపులుగా రోడ్డంతా పరుచుకుని ఉన్నారు డ్రైవరుచేతులు పడిపోయేటట్లు హారన్ మోగిస్తున్నా ఏమీ ఫలితం కనిపించడం లేదు.

'ఆపేయ్ డ్రైవరన్నా. బండి స్పీడుకు దీసుకో. ముందుకు పోవడానికి కాదు' అని ఒకడు చేతులు రెండూ ఊపుకుంటూ బస్సుకు ఎదురుగా వచ్చేశాడు. బండి ఆగింది.

'ఏందిరా! బండాసమంతా వేంగి కత!' అన్నాడు డ్రైవరు–

'గుర్రప్పందాలు! వెంకటగిరిరెడ్డి నాయుడికీ, కాపులయ్యకూ మధ్యన ఒడ్డది పందెం. గుర్రాలు బాగ బలుదేరి ఆ జాను ...ఉంది. ఈపాటికి వస్తుండాల ...గిరికే ఆదార్నబోయే బళ్ళన్ని రాకడకాడనే నిలిపేసుండారు'– అని వివరించాడు.

'పందె మెంతేంది?'

'అయిదువేలు! – అయిదువేలటు బోనీ పై పందాలన్నీ గలుపుకోని లక్ష దాటి నయ్యంటుండారు.'

'లక్షే! ఆర్నీ! ఇంతకా ఎవరు గెల్చేరనిరా?'

'ఎవరేంది? రెడ్డేన్నే. నాలుగుమాసాల నుండీ మేపుతుండాడు గుర్రాన్ని. కాపు అయ్యగూడా తక్కువ సయ్యోడేదనుకో!'

'దీంతో వాళ్లిద్దరి మధ్య మొదలుకే జెడతందేమో!'

'అసలు వాళ్ళకి సుద్దొచ్చిన సహోదర్య లేదులే. దీంతో మరింత జెడిపోతది – వెంకటగిరి నుండి గూడూరు శివార్లదాకా ఏకబిగిన పందెం అన్నా! అసల్లోకి రహారి నుండొస్తాదోని జనం జాతు, సొంతల పంతల పల్లెల్నుంచి వచ్చిపడ్డారు!'

నేనూ ఈ సంభాషణంతా వింటున్నాను. బస్సు తుఫానుపేద హోరెత్తిన సముద్రంలా ఉంది. ఉన్నవాళ్ళకాక, రోడ్డుమీద జనంకూడా బస్సులో ఎక్కి కూచున్నారు. ఇంతలో బయట కలకలం ఎక్కువైంది. మనుషులు, ఎవరికివారె, రోడ్డుకు వారగా జరిగి, మెడలుచాచి, ఆత్రంగా ముందుకు చూస్తున్నారు.

'జరుక్కోండి, జరుక్కోండి!' అంటూ కేకలు జోరుగా వినిపిస్తున్నాయి. పందెపు గుర్రం పరుగు పరిగెడుతూ వస్తోంది.

గుర్రాన్ని చిన్నాదికి పట్టారు. బండి సాగట్లో వస్తా గుర్రం మనిషొకడు అటో క్కాటూ ఇటొక్కాటూ వేసి దానిపు గుర్రం మీదికి ఒంగి నిల్చుని ఉన్నాడు. అమ్మవారి జాతర సమయాన పూనకంవచ్చిన మనిషిలా తల అటూ ఇటూ విదిలిస్తూ, చెర్నా

## జ్ఞాపకం ఉంచుకోండి!

సోడా సీసాలూ అవీ డీప్ ఫ్రీజలో పెట్టకూడదు పగులుతాయి.

ఫ్రిజిడయిరు ఉంటే– వాడు కోవాలి. అందుకు తగ్గట్టు కూరలూ యితర పదార్థాలూ కొని నిల్వచేసుకోవచ్చు. వంటలూ అవీ మిగిలినవి చక్కని డబ్బాలలో మూతలు పెట్టి అట్టే పెట్టుకోవచ్చు.

కొత్తిమీరీ పచ్చిమిరప కాయలూ కరివేపాకూ తమలపాకులూ ఫ్రిజిడయిర్‌లో పెట్టడానికి ముందే కడిగి, నీళ్లు ఆరిపోయాక మూత ఉన్న డబ్బాల్లో పెట్టి పెట్టుకోవాలి.

ఐస్ ట్రే ప్రతిసారీ కత్తి పెట్టి పెళ్ళగించకండి. ట్రే క్రింద నూనెకాగితం పెడితే చాలు. లేకుంటే వో గ్లాసుడు గోరువెచ్చని నీళ్లు పోసిన చాలు— యిట్టే వస్తుంది.

పాలూ పెరుగూ ఏం మూతలేకుండా పెట్టకూడదు. వాటి వాసన లేకుంటే మిగిలిన వాటి వాసన అన్నిటికే పట్టేస్తుంది.

ఇడ్లీపిండి, దోసెల పిండీ రెండుమూడు రోజులకి రుబ్బుకుని తేలికపాత్రలలో ఫ్రిజిడయిర్‌లో పెట్టుకోవచ్చు. పులిసిపోదు.

—కె. రా.

కోలతో గుర్రానికి చురకలు తగిలిస్తూ చాలా భీకరంగా కనిపించాడు. ఆ బండీ, గుర్రమూ, మనిషీ మొత్తం ఆ దృశ్యమంతా మెరుపు మెరిసినట్లుగా ఎదురుగ్గా ఒక్క క్షణం మెరిసి అంతలోనే వెనగ్గా ఎక్కడో కనుమరుగై పోయింది. జనమంతా, 'చోటే సాయిబు, చోటే సాయిబు' అంటూ రణగొణ ధ్వనిగా అరుస్తున్నారు. 'కాపులయ్య గెల్చాడు' అనే అరుపులకు విరామం లేదు. కాపులయ్య గుర్రపు సైసు, చోటేసాబు పేరు మోగని నోరు లేదు.

ఒక గుర్రం వెళ్ళింది. మరోదానికోసం జనం విరగబడి పోతున్నారు. అయిదు పది నిమిషాలు గడిచినా దాని జాడలేదు. మా డ్రైవరు ఇక ఆగదలుచుకోలేదు. కల్లోల సాగరంలో వోడనడిపే కప్తానులా అతి చాకచక్యంగా బస్సును ముందుకు జరుపుకుంటూ సాగుతున్నాడు. కొంచెం ముందుకుపోగానే నో విషయం తెలిసింది—గూడూరుకు ఆరు మైళ్ళదూరంలోఉన్న తిక్కవరప్పాడు దగ్గర, ఒక గోతిలో, రెడ్డి నాయుడి గుర్రం పడిపోయిందట. ఆ మాట వింటుంటే నన్నెవరో కొరడాతో కొట్టినట్లనిపించింది. నల్లగా లోతుగా భయంకరంగా, ఆ గొయ్యే మళ్ళీ ఎదురుగా కనిపిస్తుందా!—అత్యంత వేగంతో ముందుకు ముందుకు దూకుతూ వచ్చిన ఆ వస్తువే ఈ గుర్రమా?—నాలో అందోళన ఆసులో కండెలా కొట్టుకోవడం ఆరంభించింది.

# గొయ్యి

బస్సు లంకణాల బోటులా మెల్లిగా తిక్కవరప్పాడు చేరింది. ఊరికి మొగదలే రోడ్డు పక్కనే ఉంది గొయ్యి. చాలా చిన్నది. నా కలలో కనిపించినట్లు భయంకరంగా లేదు. దాని దాపునే బండి పడి ఉంది. నో ప్రక్కగా నిలుచున్న గుర్రం అతి సామాన్యంగా ఉంది. జరుగుతున్న కథకంతటికీ 'నేనే సుమా కారణం' అనే ఠీవి దానికి లేశమైనా లేదు—నా కలలో కనిపించిన గొయ్యి ఇదే అనుకోవాలనిపించలేదు. అతివేగంగా దూకుతూ వచ్చిన ఆ వస్తువీ గుర్రం కానేకాదు. ఇక్కడ, ఆ వేగమూ, దాని తాలూకు జలదరింతా, భయవివశతా, వాటి ఛాయలే లేవు. వెదికి పట్టుకుందామన్నా దొరికేట్లు లేవు. నాకు చాలా నిరుత్సాహం అనిపించింది.

ఊరు దాటిం తర్వాత డ్రైవరుకు కష్టాలారంభమైనాయి. ప్రతి యాభై గజాలకూ జనం మందలు మందలుగా బండికడ్డం వచ్చేవాళ్ళు. అందరికీ ఏ గుర్రం గెల్చిందో కనుక్కోవాలన్న ఆత్రమే.

'ఏం సామీ, ఏ గుర్రం బోయింది?'

'కాపులయ్య గుర్రం!'

'కాపులయ్య గుర్రమా? అసల్లోకే బోయిందా?'

'ఆ! అసల్లోకే. ఆరుమైళ్ళువార.

ఇట్లా అడిగిన వాళ్ళందరికీ చెప్పలేక డ్రైవరు సతమతమయ్యేవాడు. బస్సు ఆపకుండా ఉండడానికి వీలులేదు. ఆపకపోతే అడ్డంగా వచ్చే జనవంతాచేరి సునాయాసంగా ఆపేయగలరు. బస్సు దాదాపు ఇరవై మైళ్ళూ ఇట్లాగే నత్త నడకలు నడిచింది. వెంకటగిరి శివార్లలో తిరణాలలా ఉంది. నాలుగైదు లారీలనిండా జనం గుమిగూడి ఉన్నారు. బస్సులో కలకలం ఎక్కువైంది.

'ఒరేయ్ జాగర్తగుండండిరా!'

'నోరుకొచ్చినట్లు వాగమాకండి'

'ఈ సమాచారం ఇంటే ఆ జనానికి వాడు మొహాలు బడిపోతయ్'

ఎక్కువ తక్కువైతే రెడ్డినాయుడు జనం కొడ్తారు గామాల!'


ఇట్లా రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు.

వార్త బయటి జనానికి తెలిసిపోయింది. సంగతి తెలియగానే ఒక గిరజాలజుట్టు మనిషి కాలి మడమలు పిర్రలకు తాకేట్లుగా ఎగురుకుంటూ రెండుచేతులూ గాలిలో ఊపుకుంటూ, ఊరివేపుకు పరిగెత్తిపోయాడు. వాడు కాపులయ్య మనిషి. బస్సు వెంకటగిరి స్టాండు చేరింతర్వాత ఒక కొత్త తరహా లోకంలో నుంచి నిత్య జీవితంలోకి వచ్చిపడ్డట్టయింది.

తలుపు తట్టగానే మా సుగుణే తలుపు తీసింది. పలకరింపుగా నావైపు చూచింది. అబ్బ! ఏం చూపులవి!

ఆ చూపులు నవ్వడంలేదు. కొందరు వర్ణించేట్లు అవి మాట్లాడ్డమూ లేదు. కాని అవి నాకెందుకో గట్టిగా అరుస్తున్నట్లనిపించాయి. అవును. అరుపే. సందేహం లేదు. సరిగ్గా నా కల్లో అంత దూరాన్నుంచి అతి వేగంగా వచ్చి, గోతిలో పడిపోతూ పడిపోతూ ఆ వస్తువు అరిచిన అరుపు! నాకేమీ అర్థం కావడంలేదు. ఈ రెంటికీ నా మనస్సిట్లా లంకె పెడుతున్న దెందుకో తెలీడంలేదు. నా కల్లో తోచిన ఆ వస్తువులో ఎక్కడన్నా సుగుణ ఛాయైనా తోచిందా? లేదే! అయినా సుగుణ గోతిలో పడిపోవడ మేమిటి?

నన్ను నేను సమాళించుకున్నాను. మా శాంత పలకరించింది. మర్యాదలు చేసింది. కాని ఆ పలకరింపులో హాయినిచ్చే చల్లదనం లోపించినట్లనిపించింది. వీళ్ళు గాని



రెడ్డినాయుడి గుర్రంమీద పందెంకాసి వోడిపోలేదు కదా!

'మీ ఊళ్లో గుర్రప్పందాలు జరిగాయటగా!' మా శాంతను కదలేద్దామని సంభాషణ కుపక్రమించాను.

'ఊళ్లో సంగతి నాకేం తెలుసు! మా బ్రతుకే వో పందెం అయిపోయింది గదా అన్నయ్యా!' అన్నది.

అయితే ఏదో పెద్ద కదే ఉంది. సుగుణ చూపులకు వ్యాఖ్యానం చెప్పే కథైతే బాగుండును. ఆమాటా ఈ మాటా మాట్లాడుతూ శాంతను రంగంలోకి దింపగలిగాను.

'నెల్లూరునుండి నిన్న అమ్మణ్ణి చూచుకోడానికి వచ్చారు. పిల్లవాడు బాగా ఏపుగా అందంగా ఉన్నాడు. డాక్టరీ ఆఖరు సంవత్సరం చదువుతున్నాడట. ఈడూ జోడూ బాగా కుదిరినట్లనిపించిందన్నయ్యా! చెప్పొద్దూ! ఈ సంబంధమైతే కొండకొచ్చి కల్యాణం చేయిస్తానని మొక్కుకున్నాను. కాని నా మొర ఆ యేడు కొండలవాడి చెవిన పడలేదు. వాళ్ళు పాతికవేలకు పైసా తగ్గమన్నారు—మీ బావగారి సంగతి నీకు తెలియందేముంది?' అంటూ మా శాంతమ్మ కళ్ళు తుడుచుకుంది.

ఆయన సంగతి నాకు తెలియందేముంది? హాహాగే కాలేజీ లెక్చరరు గిరీ వెలగబెడుతున్నాడు. ఆయన్ని అటునుంచి యిటు తిరగేసి దులిపినా పాతికవేలు రాలడం అసంభవం.

'దానికేం తక్కువని అన్నయ్యా! కుంటిదా గుడ్డిదా! బంగారమంటి పిల్ల. చదువుకుంది. కన్నతల్లిని నేననగూడదుగానీ దాన్ని ఎవరైనా కళ్ళ కద్దుకుని చేసుకోవాల్సిన మాట. ఈ మాయదారి కట్నాల గోతిలో ఇట్లా ఎంతమంది పడిపోతున్నారో!! అన్నది.

నా మనస్సులో స్ఫురున ఏదో పాకినట్లయింది. అంతవరకూ నా కర్థంకాని ఆ లంకె ఏమిటో మెరుపుకొట్టినట్లు ఎదురుగా కనపడుతోంది. అయితే నా కళ్లో, అతివేగంగావచ్చి, గోతిలో పడిపోయిన ఆ వస్తువు నిస్సందేహంగా సుగుణే. నల్లగా భయంకరంగా అసహ్యంగా ఉన్న ఆ గొయ్యి నా కళ్ళముందు ఇప్పటికీ చెదరకుండా స్పష్టంగా కనిపిస్తూనే ఉంది.

